క్లుప్తంగా

కామరాజుకు ఉద్యోగోన్నతి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం స్టేట్ టాక్స్ ఆఫీస్‌లో జీఎస్‌టీఓగా పనిచేస్తున్న బడియా కామరాజు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. కామరాజు పాడేరుకు పదోన్నతిపై వెళ్లనున్నారు. ఆయనకు జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు కల్లేపల్లి రాంగోపాల్, కంఠ వేణు, తైక్వాండో శ్రీను, రాయి వేణుగోపాల్, బోయిడి మురళిష్ణ అభినందనలు తెలిపారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న గుంటుకు చంద్రశేఖర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పట్టుశాలి కులస్తులంతా ఏకతాటిపైకి వచ్చి ఐక్యతగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని పట్టుశాలి సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు గుంటుకు చంద్రశేఖర్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ బొల్లా లలితారావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పట్టుశాలి భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద పట్టుశాలీ కుటుంబాలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. జిల్లాలో పట్టుశాలీలంతా కుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు కాశీప్రసాద్, పాలిశెట్టి మల్లిబాబు, పి.రామకృష్ణ, పి.మురళి, మందుల మోహన్, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

గండి పూడ్చివేత



గండిని పూడ్చి వేస్తున్న దృశ్యం

లావేరు: తాళ్లవలస గ్రామంలోని తమురు కాలువకు పడిన గండిని అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సంచాన సత్యన్నారాయణ సొంత నిధులతో మరమ్మతులు చేయించి ఆదర్శంగా నిలిచారు. కాలువకు గండి పడడంతో వర్షాలు పడేటప్పుడు కాలువ ద్వారా చెరువుల్లోకి నీరు వెళ్లకుండా బయటకు పోతుంది. దీంతో చెరువులు నిండక పంటలు పండక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని రైతులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. దీంతో సత్యన్నారాయణ స్పందించి తన సొంత నిధులతో కూలీలను పెట్టి తాత్కాలికంగా కాలువకు పడిన గండిని పూడ్చివేయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కదంబ పుష్పాలతో విజయగణపతి



కదంబ పుష్పాలతో విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయంలో ఆదివారం కదంబ పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు పెంట కిరణ్‌శర్మ, సుర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఘనజీవామృతంతో అధిక దిగుబడులు



ఘనజీవామృతం తయారు చేసిన దృశ్యం

జి.సిగడాం: వరిసాగులో ఘనజీవామృతాన్ని వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని నేచురల్ యూనిట్ ఇన్‌చార్జి ఎన్.సంతోషి అన్నారు. ముషినివలస యూనిట్ పరిధిలోని జాడ గ్రామంలో పోతల సన్యాసిరావు పంట పొలంలో చేస్తున్న దమ్ములో ఘనజీవామృతం తయారీపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. సహజ వనరులను వినియోగించి వివిధ రకాల ద్రావణాలు, కషాయాలను తయారు చేసుకుంటే సుస్థిర వ్యవసాయంతో సురక్షిత ఆరోగ్యం సాధించుకోవచ్చున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసుకుంటే తక్కువ పెట్టిబడి, అధికదిగుబడులు సాధించగలమన్నారు.

'అవధానం' భాషాభిమానులకు
వీనుల విందు



శతావధాని పద్మాకర్‌ను సత్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



పుస్తకావిష్కరణలో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- సంపూర్ణ శతావధాన ప్రక్రియ ముగింపు కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం కల్చరల్: భాషాభిమానులకు, సాహితీ ప్రియులకు అవధాన వేదిక వీనులవిందు కలిగించిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో మూడురోజులుగా సుమిత్రా కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సంపూర్ణ శతావధాన ప్రక్రియ ముగింపు కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. ఈ వేదికను సుమిత్రా కళా సమితివారు అవధాన వేదికగా మార్చారన్నారు. ఎంతో గొప్ప వ్యక్తులను జిల్లాకు తీసుకువచ్చి కార్యక్రమాలు భారీ ఎత్తున చేయడం అభినందనీయమన్నారు. ముందుగా డాక్టర్ పిలకా శాంతమ్మ రచించిన 'ఇతిహాస వనితా స్వగతం' పుస్తకాన్ని మంత్రి, అతిథులు ఆవిష్కరించారు. ప్రముఖ అవధాని వద్దిపర్తి పద్మాకర్ శతావిధాన పద్యధారణ చేసి మెప్పించారు. ఈ సందర్భంగా పద్మాకర్‌ను నిర్వాహకుల తరఫున మంత్రి ధర్మాన సత్కరించారు. అవధానులు, ప్రాశ్నికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈశ్వరరావు, పైడిశెట్టి జయంతి, సమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకర శర్మ, అవధానులు బులుసు అపర్ణ, ఆముదాల మురళి, దత్తాత్రేయ శర్మ, ఎ.గోపాలరావు, సువర్ణవర్మ, డాక్టర్ కె.సోమేశ్వరరావు, కిల్లాన ఫల్గుణరావు, మండవిల్లి రవి, నక్క శంకరరావు, కొంక్యాన మురళి, డి.పార్థసారథి, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమరయోధులను
స్మరించుకోవాలి



రణస్థలం: ఎర్రవరంలో మట్టికి వందనం చేస్తున్న సాయికుమార్ తదితరులు

రణస్థలం: భారతదేశ స్వాతంత్య్రం కోసం పోరటం చేసి వీర మరణం పొందినవారితోపాటు సమరయోధులను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం అన్నారు. ఎర్రవరం గ్రామంలో నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేలతల్లికి నమస్కరించుకోవడం, స్వాతంత్య్ర వీరులకు వందనం సమర్పించడం ఎంతో పుణ్యమన్నారు. అనంతరం మట్టిని పట్టుకుని ప్రతిజ్ఞ చేశారు. వసుదాకు వందనంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో ఎం.శ్రీనివాసనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, బోనెల చిన్న చంద్రశేఖర్, రమణమ్మ, వొమ్మిదారపు రమణ, అయ్యప్ప రమణ, అరసవల్లి సత్యనారాయణ, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

లావేరు: గురుగుబిల్లి గ్రామంలో నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం, నాభూమి నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మట్టిని పూజించడం, ప్రతిజ్ఞ చేయడం, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం మండల ఏపీవో ఆర్.సత్యవతి, టీఏ గౌరునాయుడు, ఎఫ్ఏ నేతల రామారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ టి.లక్ష్మణ, మాజీ సర్పంచ్ బాడిత రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాడిత వెంకటరావు, వలంటీర్లు పాల్గొన్నారు.



లావేరు: గురుగుబిల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

జి.సిగడాం: ఎందువ గ్రామంలోని సచివాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నాభూమి–నాదేశం ఫలకాన్ని మండల ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ ఆవిష్కరించారు. ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల, స్థానిక సర్పంచ్ అల్లు జోగినాయుడు. వైఎస్సార్‌సీపీ నాయకులు వాన వెంకటరమణ, కింజరాపు మల్లేశ్వరావు, గొల్వె రాములు, నక్క కోటేశ్వరరావు, ఏపీవో చోళ్ల సత్యన్నారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఏర్నేన జ్యోతి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎస్‌పీఆర్‌పురం పంచాయతీలో కూడా నాదేశం–నాభూమి కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కంది రమాదేవి, ఏపీవో రెడ్డి రామకృష్ణంనాయుడు, పంచాయతీ కార్యదర్శి కూనిబిల్లి కోటేశ్వరరావు ఉన్నారు



జి సిగడాం: ఎందువలో నాదేశం–నా భూమి ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



జి.సిగడాం: ఎస్‌పీఆర్‌పురంలో మొక్కలను నాటుతున్న రమాదేవి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



లావేరు: కథను చదువుతున్న చిన్నారి

లావేరు: విద్యార్థులు చదువుపై ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలని లావేరు శాఖాగ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. స్థానిక గ్రంథాలయంలో 'చడవడం మాకిష్టం'కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు, ఇతర పుస్తకాలు చడవడంపై పోటీలు నిర్వహించారు. బాగా చదివిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకు ఎ.గడ్డెయ్య ఉన్నారు.

రణస్థలం: విద్యార్థులు చదువుతోపాటు ఉన్నతమైన వ్యక్తిత్వం అలవార్చుకోవాలని రణస్థలం గ్రంథాయల అధికారిణి పి.వరలక్ష్మి అన్నారు. గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ చైర్, చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. దినపత్రికలు, కథలను చదివించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు జాహ్నవి, అభిరామ్, రమేష్‌లకు బహుమతులు ప్రదానం చేశారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో కూడా చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు కథలు చెప్పటం, పుస్తక పఠనం, పద్యాలు చదవటంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ మలిపెద్ది చంద్రశేఖర్‌రావు, సహాయకులు బి.సూర్యానారాయణ, పాఠక కమిటీ, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రణస్థలం: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పశువులకు లంపీస్కిన్ నివారణ టీకాలు



లావేటిపాలెంలో పశువుకు టీకా వేస్తున్న దృశ్యం

లావేరు: పశువులకు లంపీస్కిన్ వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేసే ప్రక్రియ మండలంలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా లావేటిపాలెం, కేశవరాయునిపురం, జీజీ వలస తదితర గ్రామాల్లో ఆదివారం వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్రులు పశువులకు ఉచితంగా టీకాలు చేశారు. పశువులకు లంపీ స్కిన్ వ్యాధి రాకుండా ఉండటం కోసం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేయడం జరుగుతోందని.. పాడిరైతులు తప్పకుండా తమ పశువులకు వీటిని వేయించాలని వైద్య సిబ్బంది సూచించారు. వెటర్నరీ సిబ్బంది మామిడి జగదీష్ పాల్గొన్నారు.

యోగా పోటీలకు విశేష స్పందన



సర్టిఫికెట్లతో యోగా సాధకులు

శ్రీకాకుళం కల్చరల్: నేషనల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన యోగా పోటీలకు విశేష స్పందన వచ్చింది. పీఎన్ కాలనీలోని ఎస్‌సీఎస్ స్కూల్‌లో జిల్లా స్థాయి యోగా పోటీలు ఆదివారం నిర్వహించారు. రిథమిక్ యోగాలో వై.నళిని, పి.రంజితలకు గోల్డ్ మెడల్, ఆర్టిస్టిక్ యోగాలో జీవితకు గోల్డ్ మెడల్, ఆర్టిస్టిక్ యోగా మరో విభాగంలో ఎం.శ్రీకాంత్‌కు గోల్డ్ మెడల్ దక్కింది. ఎం.విజయ కుమార్‌కు సిల్వర్ మెడల్ వచ్చింది. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో బాలికల విభాగం, బాలుర విభాగంలో సత్తా చాటిన పలువురికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు తంగి స్వాతి, జి.శంకర్, కేదార్నాథ్, వెంకటరమణ, ఎస్.రమ్య, పి.మురళి, చౌదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌కు బానిసకావద్దు

పొందూరు: యువత ఫోన్లకు బానిస కావద్దని రచయిత, మానసిక నిపుణుడు బొడ్డేపల్లి భూపతిరావు అన్నారు. మండలంలోని మొదవలసలో గల ప్రభుత్వ పాఠశాల వద్ద యువత నేటి–సామాజిక బాధ్యత అనే అంశంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. భూపతిరావు మాట్లాడుతూ యువత తెలిసీ, తెలియని వయస్సులో చెడు వ్యసనాలు బారిన పడుతున్నారన్నారు. సినిమాలు, ఫోన్లను జీవితంగా భావిస్తూ.. అందమైన జీవితాలను ఆగాధంలోనికి నెట్టుకుంటున్నారన్నారు. సరైన జీవిత లక్ష్యం, గమ్యాన్ని యువత ఏర్పర్చుకోవాలన్నారు. ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ శ్యాముల్‌రెడ్డి, శాస్త్రవేత్త బొడ్డేపల్లి రమణ, హెచ్‌ఎం మొదలవలస పెంటన్నాయుడు, సర్పంచ్ మొదలవలస దివ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, రోట రీక్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రోటరీ క్లబ్ (శ్రీకాకుళం), ధర్మాన టీవీఎస్ సంయుక్తంగా 60 మంది మహిళలకు ఎలక్ట్రికల్ కుట్టు మిషన్లు సమకూర్చాయి. వీటిని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ రోటరీ అంతర్జాతీయ సంస్థ చేపడుతున్న సేవలు ప్రశంసనీయమన్నారు. అలాగే కుట్టు మిషన్లు వితరణకు విరాళం ఇచ్చిన ధర్మాన టీవీఎస్ అధినేత ధర్మాన ధర్మారావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి అన్నెపు అనంతరావు, స్టార్ టీవీ చైర్మన్, విశ్రాంత డీజీపీ సీఎం గోపీనాథ్ రెడ్డి, సీఈఓ మహమ్మద్ మోహిద్దీన్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పైడిశెట్టి జయంతి, కోణార్క్ శ్రీను, అంధవరపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపతో సమస్యలు పరిష్కారం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



ప్రజా ప్రతినిధులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ దంపతులు

రణస్థలం: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయడంతో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అయ్యావని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కోటపాలెం భద్రమహంకాళీ ఆలయ సమీపంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, సతీమణి పరిమళ దంపతులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు గడప గడప విజయోత్సవ విందును ఆదివారం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది మే 11వ తేదీన ఎచ్చెర్ల మండలంలోని తమ్మినాయుడుపేట గ్రామ సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. అప్పటి నుంచి అన్ని మండలాల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో 248 రోజులు దిగ్విజయంగా కార్యక్రమాన్ని కొనసాగించి.. ఈ నెల ఎనిమిదో తేదీన రణస్థలం మండలం పాతర్లపల్లిలో ఘనంగా ముగించినట్టు వివరించారు. వంద గ్రామ సచివాలయాల్లో 93,047 కుటుంబాలను కలుసుకున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించడంలో సఫలీకృతం అయ్యామన్నారు. గ్రామాల్లో కాలువలు, విద్యుత్, రహదారి, కుళాయిల సమస్యలను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించేవారన్నారు. పెద్ద సమస్యల పరిష్కారం కోసం బడ్జెట్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించేవాళ్లమన్నారు. సీఎం జగన్ ప్రత్యేక దృష్టితో గడప గడప నిధులు ఒక్కో సచివాలయానికి రూ. 20 లక్షలు విడుదల చేయడంతో ఆ నిధులతో పెద్ద సమస్యలను కూడా పరిష్కరించామన్నారు. వంద గ్రామ సచివాలయాల్లో శతశాతం సంక్షేమ పథకాలు అందించడంతో పాటు 90 శాతం పనులు పూర్తి చేయగలిగామన్నారు. ఎన్నికల సమీపించే సమయంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు కుటీల రాజకీయాలకు తెరలేపుతున్నారని.. అలాంటి పార్టీలకు ప్రజలే 2024లో బుద్ధి చెబుతారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రజాప్రతినిధులు



ఎమ్మెల్సీ జగదీశ్వరరావుకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ



ఎమ్మెల్యే శంకరనారాయణ దంపతులకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర మాజీ మంత్రి, పెనుగొండ ఎమ్మెల్యే ఎం.శంకరనారాయణ కుటుంబసమేతంగా స్వామిని దర్శించుకున్నారు. శాసన మండలి సభ్యుడు బుద్ధ జగదీశ్వరరావు కూడా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా సౌరహోమాన్ని చేశారు. ఈ సందర్భంగా ప్రముఖులకు ఆలయ సాంప్రదాయం ప్రకారం ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వాదాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు.

వాహన చోదకుల పాట్లు



నవభారత్ సమీపంలో పార్కింగ్ చేసిన ట్యాంకర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: నవభారత్ ఫ్లైవర్ వంతెన నుంచి ఫరీదుపేట కొయ్యారాళ్లు రోడ్డు వరకు 16వ నంబరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి రోడ్డుకు ఇరువైపులా భారీ వాహానాలను నిలిపి వేస్తుండడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై పెద్ద పెద్ద ట్యాంకర్లను పార్కింగ్ చేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. కార్లు, ఆటోలు వంటి పెద్ద విహనాలు వచ్చేటప్పుడు ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు



ఎంపిక పోటీల్లో క్రీడాకారుల జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ హ్యాండ్ బాల్ జట్టు ఎంపికలు ఉత్సాహభరితంగా సాగాయి. ఆదివారం సాయంత్రం పాత్రునివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా ఈ ఎంపికలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకరి కృష్ణ కుమార్, ఎమ్మెస్సీ శేఖర్ తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా జట్టును పంపిస్తామన్నారు. ఈ ఎంపికల కార్యక్రమంలో గౌరీశంకర్, ఈశ్వరరావు, జి.రాజశేఖర్, సతీష్‌రాయుడు, హరీష్‌రాయుడు, ఢిల్లేశ్వరరావు, డీఎస్ఏ కోచ్‌లు హాజరయ్యారు.

జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఎన్నిక



నూతన కార్యవర్గంతో సుంకరి కృష్ణ, శేఖర్, గౌరీ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉన్న జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో ఆదివారం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఆ సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎమ్మెస్సీ శేఖర్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.హరిసింగ్, ఐ.గౌరీశంకర్, పి.రవిబాబు, కోశాధికారి గురుగుబెల్లి రాజశేఖర్, సహాయ కార్యదర్శులుగా డి.ఈశ్వరరావు, ఆర్.సతీషారాయుడు, కె.రవిశంకర్. కార్యవర్గ సభ్యులుగా ఆర్.హరీష్‌రాయుడు, భరణిశంకర్, కె.సుశీల, నరసింహారావు, కె.చంద్రశేఖర్, ఎల్.ఢిల్లీశ్వరరావు, సురాజ్ బేగ్, కె.విజయలక్ష్మి, బి.లక్ష్మణరావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.